సాక్షి వనపర్తి

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



ముగిసిన సేవలు

మన్యంకొండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి నిర్వహించే సేవలు ముగిశాయి.

వివరాలు 10లో ▸



రైల్వేగేట్ సమస్యకు చెక్

బాదేపల్లిలో ఆర్‌యూబీ నిర్మాణానికి రైల్వే శాఖ ఆమోదించడంతో సమస్య తీరనుంది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /18.0

మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రి చలి ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్

‘ఉద్యానశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి’



కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ఉద్యానశాఖలోని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలంటూ మండలంలోని మోజర్ల సమీపంలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు బుధవారం తరగతులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఉద్యానశాఖలో ఖాళీలు భర్తీ చేపట్టలేదని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాకపోవడంతో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చామని.. ఆయన ఇచ్చిన హామీ ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీఓ జారీ చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తిచేయండి



గోపాల్‌పేట: మొదటి విడత మన ఊరు – మన బడి పథకంలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ రవీందర్ కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని హరిజన్‌వాడ, బండపల్లి, ఏదుట్ల ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సామర్థ్యాలు పరిశీలించారు. ఏదుట్ల ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనవెంట ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షల షెడ్యూల్ విడుదల

వనపర్తిటౌన్: డీఈఎల్ఈడీ మొదటి సంవత్సరం పరీక్షల షెడ్యూల్ బుధవారం విడుదల చేసినట్లు డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈ నెల 22న ప్రారంభమై 28వ తేదీన ముగుస్తాయని పేర్కొన్నారు.

1, 2వ దశ కౌన్సిలింగ్‌కు..

డీఈఈసెట్–2022లో ర్యాంక్ సాధించిన అభ్యర్థులు డైట్, డీపీఎస్ఈ మొదటి, రెండో సంవత్సరం ప్రవేశాల కోసం 1, 2వ దశ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈఓ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 వరకు ధ్రువపత్రాల పరిశీలన, కళాశాల కేటాయింపు, రిపోర్టింగ్ ఉంటాయని పేర్కొన్నారు.

15న వాహనాల వేలం

వనపర్తి క్రైం: వనపర్తి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్టుబడిన 7 వాహనాలకు ఈ నెల 15న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ సుభాష్‌చందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,416

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు గరిష్టంగా రూ.8,416, కనిష్టంగా రూ.4,669 ధరలు లభించాయి.. అదేవిధంగా పత్తికి గరిష్టంగా రూ.7,560, కనిష్టంగా రూ.5,845, కందులు గరిష్టంగా రూ.7,093, కనిష్టంగా రూ.6,822, ఆముదాలు రూ.6,299, పెబ్బర్లు రూ.5,986 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.6,979గా ఒకే ధర నమోదైంది. ధాన్యం సీజన్ లేకపోవడం వల్ల కేవలం కందులు మాత్రమే అమ్మకానికి వచ్చాయి.

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 1092 క్వింటాళ్ళ వేరుశనగ రాగ, క్వింటాలుకు గరిష్టం రూ.7706, కనిష్టం రూ. 4059, సరాసరి రూ. 5260 ధరలు లభించాయి. అలాగే, 32 క్వింటాళ్ళ ఆముదం రాగా గరిష్టం రూ. 6431, కనిష్టం రూ.5836, సరాసరి రూ. 6431 ధరలు పలికాయి. వీటితోపాటు 40 క్వింటాళ్ళ కంది రాగా, గరిష్టం రూ. 6739, కనిష్టం రూ. 5389, సరాసరి రూ. 6709 ధరలు వచ్చాయి.

ఆగుతూ.. సాగుతూ...

జిల్లాలో నత్తనడకన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలు



పెబ్బేర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు

- ఒక్కో పురపాలికకు రూ.2 కోట్లు కేటాయింపు
- త్వరగా పూర్తిచేయాలంటున్న వర్తకులు

అమరచింత: పురపాలికల్లో ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వం నాలుగేళ్ల కిందట నిర్ణయించింది. మంత్రి కేటీఆర్ ఒక్కో మున్సిపాలిటీకి రూ.2 కోట్లు విడుదల చేస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అప్పటి కలెక్టర్లను ఆదేశించారు. దీంతో కదిలిన యంత్రాంగం యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించినా.. నేటికీ సగభాగం నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారంటూ ఆయా పుర వర్తకులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో కొత్తగా నాలుగు పురపాలికలు ఏర్పడినా.. అమరచింత, ఆత్మకూర్‌లో గతేడాది స్థలాల ఎంపికలు పూర్తి చేశారు. కాంట్రాక్టర్ అలసత్వంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. కొత్తకోట, పెబ్బేర్ మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలు సగభాగం పూర్తయ్యాయి. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి మున్సిపాలిటీ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.



కొత్తకోటలో పిల్లర్ల దశలోనే..

పెరిగిన ధరలతో..

టెండర్ వేసిన సమయంలో సిమెంట్, ఐరన్, సామగ్రి ధరలు.. ప్రస్తుత ధరల్లో వ్యత్యాసం ఉండటంతో అదనపు భారం పడుతుందని కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనికితోడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటం కూడా కారణమని తెలుస్తోంది. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా లేదా అన్న విషయాలను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. నాలుగేళ్ల కిందట మొదలైన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీఎం ఇచ్చిన ఆదేశాలను మాత్రం ఇక్కడి మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతోనే నత్తనడకన పనులు కొనసాగుతున్నాయి.

“ త్వరగా పూర్తి చేయాలి..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి. మూడేళ్ల కిందట స్థలం ఎంపిక చేసినా.. ఆర్నెల్ల కిందటే పనులు ప్రారంభించారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాణ్యతగా త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

– జుబేర్, అమరచింత

పర్యవేక్షణ చేస్తున్నాం..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎప్పటికప్పుడు సంబంధిత ఏఈతో పర్యవేక్షణ చేయిస్తూ పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్‌ను పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించాం. మరో నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం.

– మహ్మద్ ఖాజా, పుర కమిషనర్, అమరచింత

అన్నీ ఒకేచోట..

పురపాలిక కేంద్రాల్లో కూరగాయలు, పండ్లు, పూలు, మాంసాహారం, చేపలు రహదారులపై ఎక్కడపడితే అక్కడ విక్రయించకుండా అన్నీ ఒకే సముదాయంలో దొరికేలా ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌యార్డు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పురపాలికల్లోని వ్యాపారుల వివరాలు సేకరించి దుకాణాలను వారికి అద్దెకిచ్చి వ్యాపారాలు నిర్వహించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కాని నేటివరకు నిర్మాణాలు సగం కూడా పూర్తి కాలేదని.. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



గోపాల్‌పేటలో ప్రాజెక్టు నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

వనపర్తి: జిల్లాలోని అయిదు పురపాలికల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పుర కమిషనర్లు, అధికారులతో అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాకేంద్రంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పురపాలికల్లో పురోగతిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే కోర్టు కేసులు, పన్ను వసూల అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీల పరిధిలోని నర్సరీలపై దృష్టి సారించాలని, హరితహారం, పట్టణ సుందరీకరణ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వార్షిక పురోగతి నివేదికలు, బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, కమిషనర్లు ఉదయం ఆరు గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. ఏయే మున్సిపాలిటీల్లో మిషన్ భగీరథ పథకం నీరు సరఫరా అవుతుందని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో అన్నిరకాల పన్నులను డిజిటల్ రూపంలోనే వసూలు చేయాలన్నారు. సమావేశంలో వనపర్తి పుర కమిషనర్ విక్రమసింహారెడ్డి, రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10 నాటికి పనులు పూర్తికావాలి..

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ నీటిట్యాంక్‌లు, పైప్‌లైన్ పనులు మార్చి 10వ తేదీనాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆదేశించారు. పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా సమీపంలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న 75 ఎంఎల్‌డీడ బ్ల్యూటీపీ ట్యాంకు నిర్మాణాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధ జలం అందించాలని, అందుకు అధికారులు పూర్తిగా శ్రమించి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తి చేయించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా సరిగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఎస్ఈ, డీఈలు, ఏఈలు ఇతర అధికారులు ఉన్నారు.

నెలరోజుల్లో పనులు పూర్తి..

గోపాల్‌పేట: జిల్లా ప్రజలకు ఏడాది పొడవునా తాగునీరు అందించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలో నిర్మిస్తున్న 10 ఎంఎల్‌డీ రామన్‌పాడు పంప్‌హౌస్ పనులను బుధవారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పరిశీలించారు. ప్లాంట్, మోటార్లు బిగించే పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయని ఎస్ఈ జగన్‌మోహన్, ఈఈ మేఘారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రేవల్లి మండలం కేశంపేట శివారులో 400 మీటర్ల పైప్‌లైన్ పని పెండింగ్‌లో ఉందని అధికారులు చెప్పడంతో అక్కడి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. అలాగే ఏదుట్ల సమీపంలో 400 మీటర్ల పైప్‌లైన్ వర్క్ పెండింగ్ ఉందని అధికారులు చెప్పడంతో వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రాజెక్టు నమూనాను పరిశీలించి నీరు ఎక్కడి నుండి ఎలా వస్తుందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి, సర్పంచ్ శ్రీను, డీఈ జైపాల్‌రెడ్డి, ఏఈలు మొగులయ్య, శివరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సారూ.. ‘ఆసరా’ ఇవ్వరూ..!



సదరం ధ్రువీకరణ పత్రం చూపిస్తున్న పీరునాయక్

వనపర్తి క్రైం: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం వారిది. ఆ కుటుంబాన్ని విధి వంచించింది. కుటుంబ యజమాని వింతవ్యాధి బారినపడి దివ్యాంగుడయ్యాడు. రెండు కాళ్లు కోల్పోయి ఏ పని చేయలేని స్థితికి చేరుకున్నారు. ఆసరా పింఛన్ ఇప్పించండంటూ అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాకేంద్రంలోని 5వ వార్డు వశ్యానాయక్‌తండాకు చెందిన పీరునాయక్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. రెండేళ్ల కిందట మొదట ఎడమకాలి బొటనవేలిపై గాయం కావడంతో స్థానికంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించారు. ఇన్‌ఫెక్షన్ అయిందని.. కాలు తొలగించకపోతే ప్రమాదమని సూచించి శస్త్రచికిత్స చేసి మోకాలి పైభాగం వరకు తీసేశారు. కొన్నాళ్లు సాఫీగానే ఉన్నా.. అదే వ్యాధి కుడికాలికి సైతం వ్యాపించడంతో ఏడాది కిందట అదే ఆస్పత్రిలో కుడికాలిని సైతం మోకాలి పైభాగం వరకు తొలగించడంతో మంచానికే పరిమితమయ్యాడు. 99 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు నిర్ధారిస్తూ జూన్ 29, 2022న సదరం ధ్రువీకరణ పత్రం జారీచేశారు. ప్రస్తుతం భార్య రుకునమ్మ, కుమారులు సురేష్, మోహన్ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. భర్త వైద్యానికి రూ.5 లక్షల వరకు ఖర్చయిందని.. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నామని, భర్తకు ఆసరా పింఛన్, మూడు చక్రాల వాహనం అందించి ఆదుకోవాలని వేడుకొంటుంది.

చికిత్సతోనే మచ్చల నివారణ



రోగిని పరిశీలించి వివరాలు నమోదు చేస్తున్న డా. సంతోషిలత

ఆత్మకూర్: తెల్ల, నల్లమచ్చలను మందులు వాడి నివారించుకోవాలని రాష్ట్ర లెప్రసీ సర్వే యూనిట్ వైద్యాధికారి డా. సంతోషిలత అన్నారు. బుధవారం మండలంలోని తిప్పడం పీహెచ్‌సీలో తెల్ల, నల్లమచ్చలున్న వారిని పరీక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మండలంలో 109 మందిని గుర్తించామని.. అందులో 85 మంది ఆస్పత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులకు చూపించుకొని మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. నిస్సార్ అహ్మద్, డీపీఎంలు నందీశ్వర్‌రావు, కృష్ణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

- మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిటౌన్: ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తేనే కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ మంత్రి డా. చిన్నారెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర సన్నాహక సమావేశంలో పాల్గొన్న ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఇంటికి కాంగ్రెస్ కరపత్రం అందించడంతో పాటు డోర్ స్టికర్ అతికించాలని సూచించారు. విద్యావంతులు, మేధావులను భాగస్వామ్యం చేస్తూ ప్రతి గ్రామంలో పాదయాత్ర సాగేలా కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు ఎకరాకు రూ.6 వేల రైతుబంధు, రూ.3 వేల పింఛన్ ఇవ్వనున్నట్లు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కోట్ల రవి, చీర్ల విజయ్‌చందర్, కిరణ్‌కుమార్, బ్రహ్మం, రవి, కిరణ్, కృష్ణబాబు, కదిరె రాములు, ఉమ్మల రాములు, సమద్, దివాకర్ యాదవ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి బస్సులు ప్రారంభం



పరమేశ్వరి, డీఎం

వనపర్తిటౌన్: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి వెళ్లే భక్తుల కోసం ఈ నెల 14 నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వనపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వరి తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 19 వరకు కొనసాగుతాయని, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సంస్థకు సహకరించాలని కోరారు.

15 నుంచి పోలీస్ ఈవెంట్స్

- ఉమ్మడి జిల్లాలో 6,275 మంది అభ్యర్థుల అర్హత
- జిల్లా క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఎస్పీ

మహబూబ్‌నగర్ క్రైం: కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీలో భాగంగా హైకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రిలిమినరీ రాత పరీక్షలో ఏడు మార్కులు కలిపారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అర్హత పొందిన అభ్యర్థులకు ఈ నెల 15నుంచి 21 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో డీజీపీ అంజనీ కుమార్ సూచనల మేరకు ఎస్పీ కె.నరసింహ ఈవెంట్స్ నిర్వహణ కోసం బుధవారం మహబూబ్‌నగర్‌లోని జిల్లా క్రీడమైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఈవెంట్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసి మైదానాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లాంగ్ జంప్, 1,600 మీటర్ల పరుగు, షాట్‌పుట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈసారి దేహదారుఢ్య పరీక్షలు పూర్తిగా అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు ఇతర టెక్నికల్ పరికరాలు అందుబాటులో పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 6,275 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు అర్హత సాధించారని, ఇందులో 4,512 మంది పురుషులు, 1,763 మంది మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాములు, డీఎస్పీలు మహేష్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.



జిల్లా క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కె.నరసింహ, పోలీస్ అధికారులు

అంధత్వ నివారణకే ‘కంటివెలుగు’

- డీఎంహెచ్ఓ డా. రవిశంకర్


కొత్తకోట: అంధత్వ నివారణకే ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని.. రెండోవిడత కార్యక్రమాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డా. రవిశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని రామనంతాపురం గ్రామంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిబిరాలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, గ్రామంలోని ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆయనవెంట ఎంపీడీఓ శ్రీపాద, వైద్యాధికారి రూపశ్రీ, సర్పంచ్ ఊషన్న, ఏఎన్ఎం గౌరి, అరుణ తదితరులు ఉన్నారు.



రామనంతాపురంలో డీఎంహెచ్ఓ డా. రవిశంకర్

అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి..

వనపర్తి క్రైం: అర్హులందరూ కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కంటివెలుగు కార్యక్రమ అధికారి డా. సాయినాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కడుకుంట్ల, చిమనగుంటపల్లిలోని శిబిరాలను ఆయన సందర్శించి రికార్డులు, పరీక్షల నిర్వహణ, వివరాల ఆన్‌లైన్ నమోదు విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తూ అవసరమైన కంటి అద్దాలు అందించాలని సూచించారు. బుధవారం జిల్లావ్యాప్తంగా 4,148 మందికి పరీక్షలు నిర్వహించగా, దగ్గరి చూపు సమస్య ఉన్న 558 మందికి రీడింగ్ అద్దాలు, 684 మందికి దూరపుచూపు సమస్య ఉండటంతో కావాల్సిన అద్దాలు త్వరలో అందజేస్తామని, 290 మందిని శస్త్ర చికిత్సలకు సిఫారస్ చేసినట్లు డా. సాయినాథ్‌రెడ్డి వివరించారు.



చిమనగుంటపల్లిలో వివరాల నమోదును పరిశీలిస్తున్న డా. సాయినాథ్‌రెడ్డి

శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

- మహాశివరాత్రిని పురస్కరించుకొని 370 కేటాయింపు
- ఈ నెల 14 నుంచి 19 వరకు రాకపోకలు



స్టేషన్ మహబూబ్‌నగర్/వనపర్తిటౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల నుంచి 370 ప్రత్యేక బస్సులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నడిపేందుకు అధికారులు సిద్ధమయ్యారు. గతంలో రాకపోకలు సాగించిన ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని బస్సులను కేటాయించారు. ప్రత్యేక బస్సులు ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు నడవనున్నాయి. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఏటా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భక్తులు, మాలధారాలు అధికసంఖ్యలో తరలి వెళ్తుంటారు. భక్తులకు ఆర్టీసీని చేరువ చేసేందుకు పక్కా ప్రణాళికతో రద్దీకి అనుగుణంగా బస్సులు కేటాయించారు. ముఖ్యంగా ఈ నెల 18 శివరాత్రి రోజున 9 డిపోల నుంచి 130 బస్సులు నడపనున్నాయి. అత్యధికంగా మహబూబ్‌నగర్ డిపో నుంచి 80 బస్సులు నడవనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని.. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి కోరారు.

డిపోల వారీగా బస్సుల కేటాయింపు ఇలా..

మహబూబ్‌నగర్ 80	వనపర్తి 48	గద్వాల 46
నారాయణపేట 44	నాగర్‌కర్నూల్ 43	అచ్చంపేట 40
కొల్లాపూర్ 29	కల్వకుర్తి 26	షాద్‌నగర్ 14

క్లుప్తంగా

రోడ్డు పక్కనే విగతజీవిగా..


సునంద్ (ఫైల్)

గట్టు: బైక్‌పై వెళ్తూ రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి ప్రమాదానికి గురై పడిపోవడంతో తెల్లవారే వరకు కొట్టుమిట్టాడి చివరికి ప్రాణాలను వదిలాడు. ఈ సంఘటన కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై బల్గెర చెక్ పోస్టుకు కొద్ది దూరంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని బల్గెరకు చెందిన సునంద్ (35) గట్టు జెడ్పీటీసీ బాసు శ్యామల డ్రైవర్‌గా పని పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సంగీతతో పాటు కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భావతి కావడంతో పుట్టినిల్లు అయిన కర్ణాటకలోని జమ్మలదిన్నెకు వెళ్లింది. ఆమెను చూడడానికి మంగళవారం సాయంత్రం విధులను ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తెలంగాణ సరిహద్దులోని బల్గెర చెక్ పోస్టును దాటిన తర్వాత రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించుకునే క్రమంలో ద్విచక్రవాహనం అదు పు తప్పి రోడ్డు పక్కనే పడిపోయాడు. ఎవరు గమనించకపోవడంతో కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన సునంద్ అక్కడే ప్రాణాలను వదిలాడు. తెల్లవారుజామున వ్యవసాయ పొలాల కు వెళ్తున్న వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ సంఘటనతో కుటుంబంలో విషాదం నెలకొంది.

కారు, బైక్ ఢీ: యువకుడి దుర్మరణం


మణికంఠ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: కారు, బైకు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం పాలయిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలిలా.. తలకొండపల్లి మండలం జూలపల్లి చెందిన మణికంఠ (24) కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. పట్టణంలో తన బంధువుల ఇంట్లో వివాహానికి సోమవారం వచ్చాడు. మంగళవారం మరో స్నేహితుడు సందీప్‌తో కలిసి బైకుపై నాగర్‌కర్నూల్ రోడ్డులో పట్టణం వైపుగా వస్తున్నాడు. పట్టణంలోని పార్థసారధి థియేటర్ పక్కన వీధిలో నుంచి కారు రోడ్డుపైకి వస్తుండగా బైకు వేగంతో కారును ఢీకొట్టింది. ఇలా ఘటనలో బైకుపై నుంచి కిందపడిన మణికంఠకు తలకుగాయం కావటంతో అక్కడిక్కడే మృతిచెందగా, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో ప్రథమచికిత్స అందించి హైదరాబాద్ తరలించారు. మణికంఠ కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. చేతికివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవటంతో తల్లి దండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మొగులమ్మ (ఫైల్)

గండేడ్: వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే మండలంలోని జంగంరెడ్డిపల్లి చెందిన మొగులమ్మ (60) ప్రాథమిక పాఠశాలలో 20ఏళ్లుగా మధ్యాహ్న భోజనం చేస్తున్నది. రోజు వారీలో భాగంగా ఈ నెల 1వ తేదీన పాఠశాలలో వంట చేస్తుండగా చీరకొంగుకు నిప్పంటుకుంది. దీంతో ఆమెకు తీవ్ర గాయలయ్యాయి. వెంటనే స్థానికులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాల కారణంగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంగంబండలో వృద్ధురాలి మృతి

మక్తల్: చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని సంగంబండలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటమ్మ (65) 4వ తేదీన రాత్రి గడ్డివాముకి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చేందిన్నట్లు పోలీసులు కూమారుడు రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

నారాయణపేట రూరల్: పట్టణంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వికారాబాద్ జిల్లా పెద్ద నంది గామకు చెందిన లక్ష్మితో శ్యాసన్‌పల్లి చెందిన రాజుతో కొన్నేళ్ల క్రితం వివాహైంది. పట్టణంలోని లింగయ్యగుడి ఏరియాలోని నివాసం ఉంటున్నారు. మంగళవారం సొంత గ్రామమైన శ్యాసన్‌పల్లికి వెళ్లగా అక్కడ కోలు అంజప్పతో వాగ్వివాదం అయినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్కడి నుంచి పట్టణానికి వచ్చి ఇంట్లో చీరతో ఉరేసుకుంది. గమనించిన చుట్టు పక్కల వారు వెంటనే భర్త సాయంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవుడి మాన్యంపై భూవివాదం


బోర్డును తొలగిస్తున్న గ్రామస్తులు


ఇరువర్గాలతో మాట్లాడుతున్న పోలీసులు

- రాజోళిలో ఆలయ భూములపై పట్టాలు పొందిన వైనం
- దేవాదాయశాఖ బోర్డుల తొలగింపు
- రంగ ప్రవేశం చేసిన పోలీసులు, దేవాదాయశాఖ అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం /రాజోళి: సూర్య చంద్రాదులు ఉన్నంత వరకు ఆలయాల నిర్వహణ చేసేందుకు దాతలు ఇచ్చిన భూములు పెత్తందార్ల చేతిలోకి వెళ్లిపోతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలోని రాజోళి వైకుంఠ నారాయణ స్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 454లోని 9.6ఎకరాల భూమి అన్యుల చేతిలోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం దేవుడి మాన్యంలో పట్టాలు తయారై ఇళ్లు కూడా వెలిశాయి. విషయం తెలుసుకున్న దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ బుధవారం సిబ్బందిని వెంట తీసుకెళ్లి గ్రామస్తుల సాయంతో దేవుడి మాన్యంలో ఉన్న బోర్డును తొలగించారు. విషయాన్ని దేవదాయశాఖ అధికారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తెలియజేశారు. తర్వాత అక్కడే దేవస్థానం బోర్డును పాతుతుండగా లీలా ప్రసాద్ అనే వ్యక్తి కొంతమందితో కలిసి వచ్చి ఇది తన పొలమని ఇక్కడ దేవస్థానం బోర్డు ఎలా ఏర్పాటు పెడతారంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో గ్రామస్తులు కల్పించుకుని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదించారు. ఇది తన స్థలం అని, తాను కొనుగోలు చేశానంటూ సమాధానమిచ్చాడు. ఇంతలో ఎస్‌ఐ అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని సముదాయించారు.

సర్వేలో బయటపడిన నిజాలు


లీలాప్రసాద్ పేరిట ఏర్పాటు చేసిన బోర్డు

వైకుంఠ నారాయణస్వామి ఆలయానికి చెందిన 9ఎకరాల6 గుంటల భూమి దేవదాయశాఖలోని దేవుడి పేరిట ఖిద్మత్ ఇనాముగా రిజిస్టర్ అయ్యింది. కైంకర్యం చేసే అర్చకుడు సత్యనారయణచారి కుటుంబీకులు దీన్ని అనుభవిస్తూ దేవుడి సేవచేసేలా నమోదైనట్లు దేవదాయశాఖ అధికారులు చెబుతున్నారు. కాలక్రమేణ ఈ భూమి లీలా ప్రసాద్ తనదంటూ పత్రాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. 2021 మార్చి 5వ తేది దేవదాయశాఖ అధికారులు దేవుడి భూమిగా తెలియజేసే బోర్డును ఏర్పాటు చేశారు. 2022 ఆగస్టు 25న రాజోళి పోలీస్‌స్టేషన్‌లో దేవదాయశాఖ వారు కేసు నమోదు చేశారు. అలాగే ఎండోమెంట్ ట్రిబ్యూనల్‌లో కేసు వేశారు. ప్రస్తుతం ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా దేవస్థానం భూములను గుర్తిస్తూ అక్కడి సర్వే నంబర్లు, దేవుడి మాన్యాలను తెలిపే బోర్డులు పెట్టే క్రమంలో అధికారులు రాజోళిలోని వైకుంఠనారాయణ స్వామి ఆలయ భూములలో బోర్డులు పాతారు. సర్వే నంబర్ 454/1/5 గల పట్టభూమిలో ఎకరా 10 గుంటల స్థలం తమదంటూ హెచ్చరిక చేస్తూ లీలాప్రసాద్ బోర్డును ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకుని దేవదాయశాఖ అధికారులు అక్కడికి వచ్చి గ్రామస్తుల సహకారంతో బోర్డును తొలగించారు. దీంతో వివాదం నెలకొంది.

అమ్మడం, కొనడం తప్పు..

దేవుడి భూమిని అమ్మడం కొనడం రెండూ తప్పే. దేవుడి ఆస్తులను రక్షించడం దేవదాయశాఖ బాధ్యత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా దేవుడి స్థలంలో బోర్డులు పెడుతున్నాం. గతంలో ఈ భూమి ఎండోమెంట్ ట్రిబ్యూనల్‌లో కేసు కొనసాగుతుంది. అంతే కాక పీఎస్‌లో కేసు నమోదైంది.

– పురేందర్‌కుమార్, దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి

ఎస్‌ఐతో మాట్లాడిన అసిస్టెంట్ కమిషనర్

ఈ విషయంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రాజు స్థానిక ఎస్‌ఐ కుర్మయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. తమ శాఖ నిబంధనల మేరకు బోర్డు పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కాగా శాంతిభద్రతల సమస్యలు ఉన్నాయని, ప్రస్తుతం ఎవరూ కూడా ఇక్కడ బోర్డులు పెట్టరాదని సూచించారు. కోర్టులో కేసు కొనసాగుతున్నందున తీర్పు వచ్చిన తర్వాత స్థలంపై స్పష్టత వస్తుందని ఎస్‌ఐ తెలిపారు.

ఆరాధ్యదైవం.. పోలేపల్లి ఎల్లమ్మ

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
- ఏటా 2లక్షలకుపైగా భక్తుల దర్శనం

కోస్గి: పేదింటి ఎల్లమ్మగా.. పసుపు బండారు తల్లి అంటూ పోలేపల్లి ఎల్లమ్మ దేవతను ఇలవేల్పుగా కొన్ని శతాబ్దాల నుంచి ఆరాధిస్తున్నారు. ఐదు శతాబ్దాల చరిత్ర కలిగిన పోలేపల్లి ఎల్లమ్మ తల్లి ఏటేటా పూజలందుకుంటూ లక్షలాది భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నారు. బుధవారం నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.


అమ్మవారి మూలవిరాట్

పాపాలను రూపుమాపే పసుపు బండారు

ఎల్లమ్మ దేవత జాతరకు శాస్త్రీయ నేపథ్యం ఉందని చెప్పవచ్చు. పూర్వం వైద్యశాస్త్రం అభివృద్ధి చెందని కాలంలో ఆయుర్వేదమే అందుబాటులో ఉండేది. తట్టు, మసూచి చర్మవ్యాధులకు వేపాకులు, పసుపు చికిత్సకు ఉపయోగించేవారు. గ్రామ దేవతల్లో ఒకరైన ఎల్లమ్మ ఇలాంటి వ్యాధులకు చికిత్స చేసేదనే నానుడికి జాతరలో వేప ఆకులు, పసుపు బండారుతో పూజలు చేయడం అందుకు నిదర్శనం. అమ్మవారి పసుపు బండారు, వేపాకుల ధరింపుతో పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. అప్పటి నుంచి ఎల్లమ్మ దేవతకు పసుపు బండారు మొక్కులు చెల్లిస్తున్నారు.

బోనపు నైవేద్యాలు

జాతరలో ప్రత్యేకంగా బోనాలు, బ్యాండు మేళాలు, పూనకాలతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. నుదుటికి పసుపు, కుంకుమ తిలకాలు, తెల్లని, పసుపురంగు వస్త్రాలు ధరించి తమ భక్తిని చాటుకుంటారు. జాతరలో బోనాల పూజలు ప్రత్యేకం.

భారీ హనుమంతుడి విగ్రహం ప్రత్యేకం

భక్తులు, దాతల సహకారంతో ఆలయ నిర్మాణం, మండపాలు, విశాలమైన ప్రాంగణంతో పాటు ఆలయ శిఖరం కొత్త హంగులతో నిర్మించారు. హకీంపేట స్టేజీ వద్ద నిర్మించిన ఆలయ ముఖ ద్వారం భక్తులకు స్వాగతం పలుకుతుండగా, పోలేపల్లిలో ఏర్పాటు చేసిన 46 అడుగుల అతి పెద్ద హనుమంతుడి విగ్రహం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు

పోలేపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల వివరాలను దేవస్థాన కమిటీ సభ్యులు వివరించారు. గురువారం రాత్రి 8 గంటలకు పల్లకీసేవతో ఊర్లో నుంచి ఆలయానికి అమ్మవారు చేరుకుంటారు. శుక్రవారం సిడే (రథోత్సవం) సాయంత్రం 4 గంటలకు ఉంటుంది. 11న శనివారం ఉదయం తేరులాగే(రథారోహనం), 12న ప్రత్యేక పూజలు, 13న భక్తుల ప్రత్యేక పూజల నడుమ దేవస్థానం నుంచి ఊరిలోకి అమ్మవారి పల్లకీసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటకతోపాటు వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు.

పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం



సిడే ఘట్టమే ప్రధానం..

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం సాయంత్రం 'సిడే' ఘట్టం ప్రత్యేకను చాటుతోంది. దీన్ని తిలకించేందుకు లక్షలాది భక్తులు తరలివస్తారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన ఊయలపై ఉంచి దాదాపు 50 అడుగుల ఎత్తులో ఉంచి ఆలయం చుట్టు ప్రదక్షిణ చేస్తారు. గవ్వల బండారు చల్లుతూ భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు.

విహారంలో విషాదం: ముగ్గురి పరిస్థితి విషమం


ప్రమాదంలో గాయపడిన యువకులు

అమరచింత: స్నేహితులతో కలిసి జూరాల ప్రాజెక్టు చూసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురై ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రానికి చెందిన ఏడుగురు స్నేహితులు బుధవారం ఓ కారులో జూరాల ప్రాజెక్టుకు వచ్చారు. నది పరిసరాలు, దిగువ ప్రాజెక్టు, ఎడమ కాల్వ వద్ద సరదాగా గడిపారు. అక్కడే లభించే చేపలను తిన్నారు. తిరుగు ప్రయాణంలో ప్రాజెక్టు రహదారిలోనే కారు అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో మల్లేష్, నరేష్, అరవింద్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉందని మహబూబ్‌నగర్ తీసుకెళ్లారు. మిగిలిన వారు స్వల్పగాయలతో ఆత్మకూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

పురుగు మందులతో జాగ్రత్త


మందులు పిచికారీ చేస్తున్న రైతు

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: పురుగు మందులోని విష తీవ్రతలలో తేడాలు ఉన్నప్పటికి అన్ని నిస్సందేహంగా విష పదార్థాలని తెలుసుకోవాలి. అవి తయారయ్యే కర్మాగాలలో, నిల్వ ఉండే గిడ్డంగిల్లో, రైతు పైరుపై చల్లే సమయాల్లో సాధరణంగా పురుగు మందుల వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. వీటితో అతి జాగ్రత్తగా వ్యవహరించాలని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు. జాగ్రత్తలు తీసుకున్న కొన్ని సందర్భాల్లో అనుకోని విధంగా పురుగు మందుల విష ప్రభావానికి లోనవుతారు. అందుకు తగ్గ లక్షణాలను గుర్తించి ప్రథమ చికిత్స చేపట్టాలని ఏడీఏ పేర్కొన్నారు. పురుగు మందులు మానవ శరీరంలోకి మూడు విధాలుగా చేరడానికి అవకాశం ఉన్నట్లు ఆయన వివరించారు.

చర్మం ద్వారా..

శరీరంపై పురుగు మందులు పడినప్పుడు చర్మం ద్వారా విష పదార్థం శరీరంలోకి ప్రవేశిస్తుంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉన్నప్పుడు మరింత సులభంగా, త్వరగా ప్రవేశిస్తుంది.

ముక్కు ద్వారా

పురుగు మందుల ద్వారా వెలువడే వాయువులు, ధూళి అణువులు గాలిని పీల్చడం వల్ల ముక్కు ద్వారా శరీరంలోకి విష పదార్థం ప్రవేశించి హాని కలిగిస్తుంది.

నోటి ద్వారా

పురుగు మందులను ముట్టుకున్నప్పుడు లేదా వాడిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల, పురుగు మందులతో కలుషితమైన ఆహార పానియాలు తీసుకోవడం వల్ల, పురుగు మందుల అవశేషాలు, పరిమితికి మించి ఉండే ఆహార పదార్థాలు తినడం వల్ల తెలిసి, తెలియక పురుగు మందులు నోటి ద్వారా తీసుకోవడం వలన ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుంది. ఒక్కొక్కప్పుడు మరణం సంభవిస్తుంది.

ప్రథమ చికిత్స

చర్మం ద్వారా విష పదార్థం ప్రవేశించినప్పుడు వెంటనే శుభ్రమైన నీటితో సబ్బు ఉపయోగించి పలుమార్లు కడుక్కోవాలి. కంటిలో పడినప్పుడు కూడా శుభ్రమైన నీటిని అధికంగా ఉపయోగించి కడుక్కోవాలి. చికిత్స కోసం వెంటనే వైద్యున్ని సంప్రదించాలి. బట్టలపై పడినప్పుడు వెంటనే తీసివేయాలి. వాటిని ఉతికి శుభ్రం చేసిన తర్వాతనే ధరించాలి. ముక్కుతో పీల్చినప్పుడు విష పదార్థం శరీరంలోకి ప్రవేశించినపుడు, విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వెంటనే కలుషిత వాతావరణం నుంచి దూరం తీసుకెళ్లాలి. ధారాళంగా గాలి వచ్చే పరిశుభ్రమైన వాతవరణంలోకి మార్చాలి. వేసుకున్న బట్టలు శరీరానికి అంటిపెట్టుకుని ఉన్నట్లయితే వదులు చేయాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్న లేక పూర్తిగా ఆగిపోయిన వెంటనే కృత్రిమ శ్వాస కల్పించాలి. వైద్యుని వద్దకు తీసుకెళ్లే వరకు కృత్రిమ శ్వాస అందించాలి. ఆరోగ్యమైన వ్యక్తి ఎవరైనా తన నోటి ద్వారా అతని నోటిలోని గాలిని ఊది సులభంగాను, శక్తివంతంగాను ఊపిరిపోయొచ్చు. విష ప్రభావానికి లోనైన వ్యక్తిని వీలైనంత త్వరగా చికిత్స కోసం వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

నోటి ద్వారా విష పదార్థం తీసుకున్నప్పుడు కడుపులో నుంచి బయటికి రావడానికి వెంటనే వాంతి చేయించాలి. గ్లాసు వేడి నీళ్లలో స్పూన్ ఉప్పు లేక ఆవాల పొడి కలిపి తాగించాలి. గొంతులో వేలు పెట్టి కక్కించాలి. ఇలా పలుమార్లు చేయాలి. కడుపులోని పదార్థం ఖాళీ అయ్యేటట్లు చూడాలి. సాధారణంగా విష విరుగుడుకు వాడే పదార్థం తాగించాలి. 8 గ్రాముల ఛార్‌కోల్, 4 గ్రాముల ట్యానిక్ యాసిడ్, 4 గ్రాముల మెగ్నీషియం ఆక్సైడ్ రసాయనాలను అర గ్లాసు వేడి నీళ్లలో కలిపి తాగించాలి. పాలు, గుడ్డులోని తెల్లసొన, జలటీన్, లేపనం, ఇస్తే జీర్ణాశయం, లోపలి భాగానికి హాని కలగదు. వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే జీర్ణాశయం, చిన్న ప్రేగులు వీలైనంత శుభ్రం అయ్యేలా చేస్తారు. అనంతరం చికిత్స అందిస్తారు.

బీభత్సం సృష్టించిన దొంగలు

- రెండు ఇళ్లు, రెండు దుకాణాల్లో చోరీ


ధ్వంసమైన బీరువా

గోపాల్‌పేట: మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. పోలీసులు, స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మౌలానాబీ, మహమూద్ భార్యాభర్తలు ఉంటున్నారు. వారి కూతురు ప్రసవం ఉండటంతో ఖర్చుల కోసం ఇంట్లో రూ.90వేల నగదును దాచుకున్నారు. రెండు ఇళ్ల ఉండటంతో డబ్బులు పాత ఇంట్లో దాచిపెట్టారు. రోజు లాగే మంగళవారం రాత్రి కొత్త ఇంట్లో పడుకున్నారు. పాత ఇంట్లో దొంగలు బీరువా తెరిచి బ్యాగులో ఉన్న రూ.90వేలు ఎత్తుకెళ్లారు. బస్టాండు సమీపంలో ఉన్న జగదీశ్వర్‌రావు ఇంట్లో చొరబడి ఎల్‌ఈడీ టీవీ, వెండి ఆభరణాలు (సుమారు 30 తులాలు) చోరీ చేశారు. అలాగే చాకల్‌పల్లి రోడ్డులో ఉన్న కిరాణ దుకాణం షట్టర్ పగులగొట్టి రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆ పక్కనే ఉన్న పైపుల దుకాణం సైతం షట్టర్ తెరిచారు. కానీ ఎటువంటి వస్తువులు పోలేదని యజమాని తెలిపారు. బుధవారం ఉదయం విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఎప్పుడూ లేనిది ఒక్క రోజులోనే దొంగలు చోరీకి పాల్పడటంతో మండల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

యువతి అదృశ్యం

అచ్చంపేట రూరల్: కళాశాలకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన బుధవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలంలోని కొత్తపల్లికి చెందిన మౌనిక తల్లిదండ్రులతో కలిసి పట్టణంలో ఉంటూ కళాశాలలో చదువుతోంది. మంగళవారం నుంచి ఇంటి నుండి కళాశాలకు వెళ్లిన యువతి సాయంత్రం ఇంటికి రా కపోవడంతో సమీప బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిలకడగా ఉల్లి ధర


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి కుప్పలు

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం బహిరంగ వేలంలో ఉల్లి ధర నిలకడగా ఉంది. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు పెద్ద ఎత్తున ఉల్లి అమ్మకానికి వచ్చింది. దాదాపు వెయ్యి బస్తాల ఉల్లిని మార్కెట్‌కు తెచ్చారు. ఉదయం 10గంటల నుంచి ప్రారంభమైన వేలంలో క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,600, కనిష్టంగా రూ. 900 వరకు ధరలు పలికాయి. మార్కెట్‌లో 45 కేజీల బస్తా ధర గరిష్టంగా రూ.800, కనిష్టంగా రూ.450 వరకు విక్రయించారు. చిరు వ్యాపారులతో పాటు, వినియోగదారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు. మధ్యాహ్నం వరకు మార్కెట్ అంతా ఉల్లి వ్యాపారంతో సందడిగా కనిపించింది.

పోలీసుల అదుపులో నిందితులు?

మహబూబ్‌నగర్ క్రైం: తండ్రి, కొడుకుపై కత్తులతో దాడి చేసిన ఘటనలో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టణంలో కత్తులతో దాడులు చేయడం కలకలం రేపింది. మంగళవారం రాత్రి 9గంటల ప్రాంతంలో బాయమ్మతోట నుంచి గీతా హోటల్ వెళ్లే మార్గంలో శ్రీనివాసకాలనీకి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మహ్మద్ హబీబ్ రహమాన్, కొడుకు అబ్దుల్ రహమాన్‌పై కత్తులతో దాడి చేసిన ఘటన విధితమే. మహ్మద్ హబీబ్ రహమాన్ కదలికలపై పూర్తిగా రెక్కీ నిర్వహించి, సత్యం చౌరస్తాలోని ప్రైవేట్ ఆస్పత్రి నుంచి తండ్రి, కొడుకును, నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై వెంబడించారు. సత్యం చౌరస్తా నుంచి శ్రీనివాస కాలనీ వరకు మార్గమధ్యలో ఎక్కడా అవకాశం దొరికితే అక్కడ దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే బాయమ్మతోట సమీపంలో కొంత నిర్మానుష్యంగాగా ఉన్న ప్రాంతంలో దాడి చేశారు. ఈ వ్యవహారంలో ఉన్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దాడి వెనుకల ఉన్న ప్రధాన వ్యక్తులతో పాటు ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరి వివరాలపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించే అవకాశం ఉంది. ఈ దాడికి ప్రధాన కారణం అల్లీపూర్ వద్ద ఉన్న భూమి వ్యవహారం అని తెలుస్తుంది.


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ఎక్సైజ్ అధికారులు

బెల్లం పట్టివేత

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేశారు. సుబ్రమణ్యాంశెట్టికి చెందిన దుకాణంలో రెండున్నర క్వింటాళ్ల బెల్లం స్వాధీనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు. అనంతరం దుకాణాన్ని సీజ్ చేసి, తహసీల్దార్ దామోదర్ ఎదుట బైండోవర్ చేశారు. ఇకపై బెల్లం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ హైదరాబాద్, ఇబ్రహీంపట్నం–జనహర్ష డ్రీమ్ సిటీ– 1 & 2లోని ప్లాట్లు అమ్మబడును. మరియు కొనబడును. సంప్ర: 9247266234, 8886972345

SERVICES

■ బాలాజీ గోల్డ్: మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్). తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019.

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేకోవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా ఋణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237

WANTED

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం. జీ. 18K. ఏజెంట్స్ కమీషన్ 3K Ph: 7569955551, 9848571888

■ వరంగల్‌లోని టిఫిన్ సెంటర్‌లో పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. జీతం: 18000+రూం + భోజనం ఫ్రీ. సెల్: 6281342080, 9949857816.

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ.500/–

HAPPY BIRTHDAY

గమనిక

– సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

జూన్ కల్లా 76 మెగావాట్ల నిర్మాణం

నిర్మాణ ఏజెన్సీలతో సింగరేణి చైర్మన్ శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: 76 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించి సింగరేణి సంస్థ నిర్మిస్తున్న ఐదు ప్లాంట్లను మే నెల కల్లా పూర్తి చేసి.. జూన్ నెలలో తెలంగాణ ట్రాన్స్‌కోకు అనుసంధానం చేయాలని సంస్థ చైర్మన్ ఎన్.శ్రీధర్ నిర్మాణ ఏజెన్సీలను ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో బుధవారం నిర్వహించిన సోలార్ విద్యుత్ సమీక్ష సమావేశంలో ఆయన కొత్త ప్లాంట్ల నిర్మాణాలపై లోతుగా చర్చించారు. సంస్థ చేపట్టిన మొత్తం 300 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లలో ఇప్పటికే 224 మెగావాట్ల సామర్థ్యం గల 9 ప్లాంట్లను విజయవంతంగా పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన ఆ 76 మెగావాట్ల సోలార్ నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి చేయాలన్నారు. డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి సత్యనారాయణరావు ముందుగా నిర్మాణంలో ఉన్న ప్లాంట్ల గురించి వివరించారు. దీనిపై నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో శ్రీధర్ నేరుగా చర్చించారు. కాలపరిమితులు నిర్ణయించుకొని, రోజుకు రెండు షిఫ్టులలో పనులు పూర్తి చేయాలన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ.100 కోట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.100 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఉన్న ఈ దేవాలయ అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రణాళిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ దేవాలయ అభివృద్ధి కోసం నిధులు ఇస్తానని సీఎం కేసీఆర్ గతేడాది డిసెంబర్‌లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

కొత్తగా 2 కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం 3,688 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు వైరస్ బారిన పడ్డారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో ఇద్దరు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం 27 మంది చికిత్స పొందుతున్నట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

పెళ్లికి పెద్ద సాయం

- రేపు 'వైఎస్సార్ కల్యాణ మస్తు'.. 'షాదీ తోఫా'
- పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఏపీ సర్కారు సాయం
- కొత్తగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌కు ఆమోదం
- ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



సాక్షి, అమరావతి: నిరుపేద తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్లిళ్లు భారం కారాదనే ఉద్దేశంతో 'వైఎస్సార్ కల్యాణ మస్తు', 'షాదీ తోఫా'పథకాల అమలుకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నెల 10వ తేదీన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు భవన నిర్మాణ కార్మికులు, విభిన్న ప్రతిభావంతుల్లో దరఖాస్తు చేసుకున్న 4,536 కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ.38.18 కోట్లు పంపిణీ చేయనుంది. గతంతో పోలిస్తే సాయం మొత్తాన్ని భారీగా పెంచింది. ఈ క్రమంలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల కోసం దరఖాస్తు చేసుకునే వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణతను తప్పనిసరి చేసింది. గత అక్టోబరు నుంచి డిసెంబరు వరకు జరిగిన వివాహాలకు సంబంధించి అందిన దరఖాస్తులను జనవరిలో తనిఖీ చేసి ఫిబ్రవరిలో ఆర్థిక సాయం చెల్లించనుంది. ప్రతి మూడు నెలలకు ఒకసారి దరఖాస్తులను పరిశీలించి నాలుగో నెలలో లబ్ధి అందించనుంది. మరోవైపు చంద్రబాబు తన హయాంలో నమ్మించి నట్టేట ముంచిన పొదుపు సంఘాల్లోని 79 లక్షల మంది అక్కచెల్లెమ్మలను ఆదుకుంటూ 3వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,500 కోట్ల పంపిణీకి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో మంత్రివర్గం సమావేశమైంది. సంక్షేమం, విద్య, పరిశ్రమలకు ప్రోత్సాహకం, ఆరోగ్యం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వాటిని మీడియాకు వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

- ఫిబ్రవరి 24న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ రైతు భరోసా - పీఎం కిసాన్.
- అక్టోబరు – డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి జగనన్న విద్యాదీవెన ద్వారా ఫిబ్రవరి 28న పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించనుంది.
- ఉగాది సందర్భంగా మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 10-04-2019 నాటికి పొదుపు సంఘాల మహిళలకు చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిలు రూ.25 వేల కోట్లు చెల్లిస్తానని పాదయాత్రలో సీఎం జగన్ ప్రకటించారు. మాట ప్రకారం ఇప్పటికే దాదాపు రూ.13 వేల కోట్లకు పైగా అందించారు. తాజాగా మరో రూ.6,500 కోట్లు ఇవ్వనున్నారు.
- జగనన్న వసతి దీవెన కింద ఈ ఏడాదికి సంబంధించి దాదాపు 10.50 లక్షల మంది విద్యార్థులకు మేలు చేస్తూ ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.20 వేల వరకూ సాయం అందించనుంది. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఇప్పటివరకు క్యూఎస్ ర్యాంకింగ్ టాప్ 200 విశ్వవిద్యాలయాలను పరిగణనలోకి తీసుకోగా తాజాగా 320కి పెంచారు. ఇకపై దాదాపు 21 సబ్జెక్టులకు సంబంధించి టాప్ 50 కాలేజీలు లేదా విద్యాసంస్థల్లో సీటు సాధించిన వారికి జగనన్న విదేశీ విద్యాదీవెన వర్తించనుంది.
- కర్నూలులో 50 ఎకరాల్లో రెండో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(ఎన్‌ఎల్‌యూ) ఏర్పాటు ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



హైదరాబాద్‌లో బుధవారం జరిగిన జడ్చర్ల ఎమ్మెల్యే సి. లక్ష్మారెడ్డి కుమారుడు స్వరణ్ వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, సీహెచ్ మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ఎ. జీవన్‌రెడ్డి, గణేశ్ బిగాల, కాలె యాదయ్య తదితరులు.

'ఎర' కేసు విచారణ 17న

హైకోర్టు ఆదేశాలపై స్టే, స్టేటస్‌కోకు నిరాకరించిన సీజేఐ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ఎమ్మెల్యేల ఎర కేసు విచారణ ఈ నెల 17న చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా బుధవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ఇదే అంశాన్ని మంగళవారం సీనియర్ న్యాయవాది దవే ప్రస్తావించారని గుర్తుచేశారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే లేదా స్టేటస్‌కో విధించాలని అభ్యర్థించారు. కేసు దర్యాప్తు సీబీఐకు అప్పగిస్తే నీరుగారిపోతుందని తెలిపారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్.. స్టే లేదా స్టేటస్‌కో ఇవ్వడానికి నిరాకరించారు. ఈ నెల 17న విచారణ చేపడతామని ఆ సమయంలో అన్ని అంశాలు పరిశీలిస్తామన్నారు. అయితే విచారణ ఈనెల 13న చేపట్టాలని లూథ్రా పలుమార్లు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 17నే విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

అది ట్యాపింగ్ కాదు..
రికార్డింగ్ వాయిస్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న లంకా రామశివారెడ్డి

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే
- నాకు వచ్చే ప్రతి ఫోన్ కాల్ ఆటోమేటిక్‌గా రికార్డ్ అవుతుంది
- చెన్నైలో ఉన్నప్పుడు ఆ రికార్డింగ్ వాయిస్‌ను నా స్నేహితుడికి పంపాను
- అది వైరల్ అయ్యి.. ఇంత రాద్ధాంతం అవుతుందని అనుకోలేదు
- కోటంరెడ్డి ఆరోపణలను కొట్టిపారేసిన స్నేహితుడు లంకా రామశివారెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తన ఫోన్‌ను ప్రభుత్వం ట్యాపింగ్ చేసిందంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన స్నేహితుడు లంకా రామశివారెడ్డి కొట్టిపారేశారు. అది ఫోన్ ట్యాపింగ్ కాదని.. ఫోన్‌లో తాను రికార్డ్ చేసిన వాయిస్ మాత్రమేనని స్పష్టం చేశారు. రామశివారెడ్డి బుధవారం నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. 'నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నా స్నేహితుడే. డిసెంబర్‌లో నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోటంరెడ్డి ప్రభుత్వ అధికారుల మీద, ఆయనకు కలిగిన ఇబ్బందుల మీద సుదీర్ఘంగా మాట్లాడారు. అదే రోజు రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాకు ఫోన్ చేశాడు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశం విషయాలపై చర్చించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల విషయంలో తొందరపాటుగా మాట్లాడకుండా ఉంటే బాగుండేదని సలహా ఇచ్చాను. నియోజకవర్గ నిధులు, కాంట్రాక్టు పనులు, ఇతర పరిణామాలన్నీ సుదీర్ఘంగా చర్చించుకున్నాం. అవన్నీ కూడా నా ఫోన్‌లో ఆటోమెటిక్‌గా రికార్డయ్యాయి. నేను చెన్నై వెళ్లినప్పుడు.. కోటంరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన వాయిస్ రికార్డును నా స్నేహితుడికి పంపాను. అది యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప.. కావాలని చేసింది కాదు. ఆ తర్వాత అది కాస్తా వైరల్ అయ్యింది. ఇంత పెద్ద వివాదం అవుతుందని ఊహించలేదు. కోటంరెడ్డి అనవసరంగా చిన్న విషయంపై ఇంత రాద్ధాంతం చేస్తాడని అనుకోలేదు. రెండు, మూడు రోజుల్లో సమసిపోతుందనుకున్నా. అందుకే ఇంతకాలం బయటకు రాలేదు. కానీ కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో నాకు కొంత ఆందోళన కలిగింది.

ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఇప్పుడు బయటకు వచ్చా. కోటంరెడ్డి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేసినా ఫర్వాలేదు. నాది ఆండ్రాయిడ్ ఫోన్. ప్రతి ఫోన్ కాల్ రికార్డ్ అవుతుంది. గత 5 నెలలుగా నేను వాడుతున్న ఫోన్‌ను చెక్ చేసుకోండి. అన్ని కాల్స్ రికార్డ్ అయిన విషయం తెలుస్తుంది. ఎవరు వచ్చినా.. నా ఫోన్ ఇస్తా.. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి నిజాలు తెలుసుకోవచ్చు. నేను వాయిస్ రికార్డు పంపిన నా స్నేహితుడి పేరును విచారణ అధికారులకు చెబుతా. ఆయన పేరు ఇప్పుడు బహిరంగంగా చెప్పి.. ఇబ్బంది పెట్టడం నాకు ఇష్టం లేదు'అని లంకా రామశివారెడ్డి వివరణ ఇచ్చారు.

ప్రభుత్వ వినతి తిరస్కృతి

- ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరిస్తూ హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిన తీర్పు అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే వరకు హైకోర్టు తీర్పును యథాతథంగా ఉంచాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సింగిల్ జడ్జి వద్ద దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను విచారణకు అనుమతించాలని కోరుతూ ప్రభుత్వం ద్విసభ్య ధర్మాసనాన్ని కోరింది. ఈ అభ్యర్థనను తిరస్కరిస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సింగిల్ జడ్జి వద్ద ఉన్న పిటిషన్‌ను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ప్రభుత్వం తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ, ఇప్పటికే సుప్రీంకోర్టులో ప్రస్తావించామని, సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసే వరకు సింగిల్ జడ్జి యథాతథస్థితి మధ్యంతర ఉత్తర్వులు జారీ అంశంపై విచారణ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై ధర్మాసనం, ఒకసారి సింగిల్ జడ్జి తీర్పు చెప్పిన తర్వాత దానిపై అప్పీల్ కూడా దాఖలైనప్పుడు మళ్లీ ఆ అంశాన్ని సింగిల్ జడ్జి విచారణ చేసే ఆస్కారమే లేదని చెప్పింది. సాంకేతికంగా ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పిందనే కారణంగా సింగిల్ జడ్జి విచారణకు అనుమతించాలని ఏజీ కోరగా అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. సిట్ నుంచి కేసు ఫైళ్లు ఇవ్వాలని సీబీఐ ఒత్తిడి చేస్తోందని, సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసే నేపథ్యంలో సీబీఐ అత్యుత్సాహం సరి కాదని ఏజీ చెప్పారు. తమ తీర్పుపై అభ్యంతరాలు ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలేగానీ ఇదే హైకోర్టులో అప్పీల్‌కు ఆస్కారమే లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది.

వర్మీ కంపోస్టుతోనే పోషకాల పెంపు



బిజినేపల్లి: పంట కోత అనంతరం లభించే అవశేషాలతో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసుకోవచ్చని, ఎరువును పొలంలో వినియోగించడం వలన పోషకాల శాతం పెరుగుతుందని పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పాలెం కేవీకేలో గిరిజ ఉప పథకంలో భాగంగా వర్మీ కంపోస్టు ఎరువు తయారీపై మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన నైపుణ్యత, శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణ తీసుకున్న గిరిజన రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులను రైతులు ఎక్కువగా వినియోగించాలని, కృత్రిమ ఎరువుల వల్ల నేలకు నష్టం కలుగుతుందని, దీనిని రైతులు గమనించడం లేదన్నారు.

1,021 అడుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,090, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

హీరో గ్లామర్ బైక్ మైలేజ్ పోటీలు

పాలమూరు: అశ్విని హీరో షోరూం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో హీరో గ్లామర్ ఎక్స్‌టెక్ వాహనం మైలేజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ముగ్గురు వాహనదారులకు హీరో షోరూం ఎండీ దిలీప్ బహుమతులు అందజేశారు. అనంతరం ఎండీతో పాటు హీరో కంపెనీ టెరిటరి మేనేజర్ పవన్ మాట్లాడారు. హీరో బైక్‌లు అత్యధిక మైలేజ్ ఇస్తున్నాయని, దీంతో వాహనదారులు అధికంగా ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వీస్ మేనేజర్ ఖలీల్, రాజశేఖర్ పాల్గొన్నారు.



తీరనున్న రైల్వేగేట్ సమస్య



బాదేపల్లిలో మూసి ఉంచిన రైల్వేగేట్

- ఆర్‌యూబీ నిర్మాణం కోసం అడుగులు
- సర్వే చేసిన రైల్వే, మున్సిపల్ అధికారులు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలో దశాబ్దాలుగా వేధిస్తున్న రైల్వేగేట్ సమస్య తీరనుంది. ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ అంటూ దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు ఐదేళ్లుగా నాన్చుతూ ఎట్టకేలకు ఆర్‌యూబీకి ఆమోదమిచ్చారు. రైల్వే జీఎం విషయాన్ని స్టేషన్ సందర్శనలో ప్రకటించారు. అనంతరం నిర్మాణం కోసం ఏజీఎం మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపాలిటీ కమిషనర్, సిబ్బందితో కలిసి సర్వే చేపట్టారు. పాతబజార్‌లోని గాంధీ విగ్రహం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు నిర్మించాలని నిర్ణయించారు. కేవలం ఆర్‌యూబీ మాత్రమే నిర్మించేలా, ఆర్‌యూబీకి ఇరువైపులా రెండు సర్వీస్‌రోడ్లు వేస్తూ మరో డిజైన్ సిద్ధం చేస్తున్నారు. రెండింటిని స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ పాలకవర్గానికి చూయించి వారి ఆమోదం మేరకు నిర్ణయానికి రానున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు రెండు డిజైన్లను సోమవారం లోపు సిద్ధం చేయనున్నారు. ఎట్టకేలకు గేట్ సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి. పాతబజార్, కొత్తబజార్ వాసులతోపాటు భూత్పూర్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఊరట లభించనుంది. పది నెలల నుంచి రైల్వేగేట్ పూర్తిగా మూసి ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆర్‌యూబీ కోసం సర్వే చేస్తున్న అధికారులు

రెండు డిజైన్లతో ప్రతిపాదనలు



ఆర్‌యూబీ నిర్మాణానికి రెండు డిజైన్లను దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు ప్రతిపాదిస్తున్నారు. సర్వీస్ రోడ్లతో ఒకటి, మరో డిజైన్ సిద్ధం చేస్తున్నారు. వాటిలో పట్టణవాసులకు అనుకూలంగా ఉండే వాటిని ఆమోదిస్తాం. ఇందుకోసం రైల్వేశాఖ ఏజీఎం మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేపట్టాం. – మహమూద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

వైభవంగా దర్బారు సేవ



మన్యంకొండలో శేషవాహనంలో ఊరేగుతున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారు

- మన్యంకొండలో శేషవాహనంపై ఊరేగిన స్వామి
- ముగిసిన స్వామివారి సేవలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి స్వామివారి దర్బారు సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి శేషవాహన సేవ కొనసాగించారు. పురోహిత వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామస్మరణల మధ్య స్వామివారి శేషవాహన సేవ ఊరేగింపు చేపట్టారు. అనంతరం మళ్లీ స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల పూజలు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన సేవలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న స్వామివారి సేవలు మంగళవారం రాత్రితో ముగిశాయి. జవరి 31న బ్రహ్మోత్సవాలను సాంప్రదాయ రీతిలో ప్రారంభించారు. స్వామివారికి తిరుచ్చి, గజ, హంస, సూర్య, హనుమాన్, గరుడ, అశ్వ, శేష వాహన సేవలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకుని దాసంగాలతో నైవేద్యాలు సమర్పించారు. సేవలు ముగిసినప్పటికి మార్చి 5న దిగువ కొండ వద్దనున్న అలివేలు మంగతాయారు ఉత్సవాలు ప్రారంభం అయ్యే వరకు దేవస్థానం వద్ద భక్తుల రద్దీ ఉంటుంది. అంతవరకు జాతర కొనసాగుతుంది.



అలంకరణలో స్వామివారు

ప్రయాణికులకు మెరుగైన సేవలు



డిపో ఆదర్శ ఉద్యోగులతో ఈడీ పురుషోత్తంనాయక్ తదితరులు

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తంనాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నామని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. మేనేజింగ్ డైరెక్టర్‌గా సజ్జనార్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రూ.30 కోట్లతో తార్నాక ఆస్పత్రిని కార్పొరేట్‌స్థాయికి తీర్చిదిద్దినట్లు చెప్పారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టేషన్‌ల అభివృద్ధికి రూ.148 కోట్లు విడుదల చేశారన్నారు. దాదాపు 150 నుంచి 200 ఆర్టీసీ బస్టాండ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మహబూబ్‌నగర్ డిపో లాభాల్లో ఉందని, రీజియన్ మాత్రం నష్టాల్లో నడుస్తుందన్నారు. మిగతా డిపోలు కూడా లాభాల్లోకి వచ్చి రీజియన్‌ను అగ్రస్థానంలో నిలపాలని ఆశించారు. ఆర్టీసీకి రథసారులు డ్రైవర్లేనని అన్నారు. ఆర్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి నెలలో ఆయా విభాగాల్లో 12 మందిని ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికచేసి సత్కరిస్తున్నట్లు చెప్పారు. సమన్వయంతో పనిచేసి జోన్‌లో రీజియన్‌ను లాభాల బాటాలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం డిపోలో టిమ్, కేఎంపీలో మెరుగైన ఫలితాలు సాధించిన ఆదర్శ డ్రైవర్లు గౌస్, అహ్మద్ అలీ, ఖాదర్‌పాషు, హఫీజ్, ఈకేపీలో ఆదర్శ కండక్టర్లు శ్రీధర్, లక్ష్మీప్రసాద్, నాగేందర్, నిశాంత, కలమ్మ, రాములును శాలువాతో సన్మానించి ధ్రువపత్రాలు అందజేశారు. డిప్యూటీ ఆర్‌ఎంగా పనిచేసి బదిలీపై వెళ్లిన రామును సన్మానించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు సూర్యనారాయణ, శ్యామల, డీఎం సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

– 9 మంది అరెస్ట్

గద్వాల క్రైం: పేకాట ఆడుతున్న స్థావరంపై బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మండలంలోని మేలచెర్వు శివారులో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.54,200 నగదు, 12 బైక్‌లు, సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. పేకాట ఆడటం నేరమని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలి



నల్ల బ్యాడ్జీలతో ఈఓ, అర్చక, ఉద్యోగులు

జోగుళాంబ శక్తిపీఠం: ఖమ్మం జిల్లాలోని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ విధి నిర్వహణను అడ్డుకుని దూషించిన బెల్లం వేణును అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అలంపూర్ జోగుళాంబ ఆలయ ఈఓ, అర్చకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈఓ పురేందర్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వేణు గతంలో కూడా ఆలయ ఉద్యోగులుపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్నారు. ఆలయ ట్రస్టు బోర్డు విషయంలో తనకు తెలియకుండా ఉత్తర్వులు ఎలా ఇచ్చారని అక్కడి దేవదాయ ఇన్‌స్పెక్టర్ సమతపై అనుచిత వ్యాఖ్యలతో దూషించారన్నారు. దీంతో ఆమె ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ మాట్లాడుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులంతా ఖమ్మం జిల్లా చేరుకుని బెల్లం వేణు ఇంటిని ముట్టడించి నువ్వుల నీళ్లు వదులతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రంగనాథ్, ప్రదీప్, బ్రహ్మయ్య ఆచారి పాల్గొన్నారు.